

# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

***మదాలస***

"థాంక్ గాడ్ భగవంతుడిలా వచ్చావు. కడుపుకాలిపోతోంది ఆకలితో" బ్రెడ్ మీద రేపర్‌ని చింపుతూ అన్నాడు సుదర్శన్. జయ్‌కీ, శాస్త్రి,గారికీ కూడా బ్రెడ్ పేకెట్లు ఇచ్చాడు శ్రీనివాస్.

"నేను రాలేదు - విలియమ్స్ గారు నన్ను తీసుకొచ్చారు. క్షేమంగా" చిన్నగా నవ్వి అన్నాడు శ్రీనివాస్.

"విలియమ్సా?" ఆశ్చర్యంగా అన్నాడు జయ్.

"అవును. ప్రకృతి అంటే ఆయనకి అపరిమితమైన ప్రేమ. మానవులు ప్రకృతికి చేస్తున్న అపకారాన్ని పూసగుచ్చినట్టు చెప్పారు. మానవాళి అయ్యేదశకు చేరుకునే సమయం వచ్చిందనీ, ఆ విపత్తునించి రక్షింపబడటం అంత తేలికకాదనీ కూడా అన్నారు" వివరించాడు శ్రీనివాస్.

"మన ప్రస్తుత పరిస్థితి ఏమిటి?" శ్రీనివాస్ మాటల్ని పట్టించుకోకుండా అన్నాడు సుదర్శన్. కారు బోనెట్ మీద కెక్కిన పాము ఇంకా అతని మనసులోంచి పోలేదు

"ఈ చీకటీ, మబ్బులూ వర్షం పక్కకి తప్పుకునేదాకా ఏమీ చెయ్యలేము. భయం మాత్రం పడనక్కరలేదు. కారణం విలియమ్స్ మనకి సహాయం చేస్తూ వుండటమే. అతను దారి చూసుకోపోతే రాత్రంతా ఆకలిలో గడపాల్సి వచ్చేది" మెల్లగా అన్నా స్థిరంగా అన్నారు శాస్త్రిగారు.

"నేను వెనక్కి వెళ్ళాలి" ట్రాన్స్‌లో అన్నట్టు అని బయలుదేరాడు శ్రీనివాస్. అందరికీ అంతకుముందే వాటర్ బాటిల్స్ కూడా ఇచ్చాడు.

వర్షం పెద్దదయింది, "అయ్యో.. తడిసిపోతాడు" అన్నాడు సుదర్శన్.

"తడవడు. కంటికి కనపడని ఓ గొడుగు అతన్ని తడవనివ్వదు. జాగ్రత్తగా చూడు" అన్నాడు జయ్. వర్షం తన ప్రతాపాన్ని చూపిస్తూనే వుంది. రాత్రికాని ఆ సాయం సమయంలో

"దేవుడు, దెయ్యం, స్వర్గం నరకం, పాపం పుణ్యం, కష్టం సుఖం, ఇలా ద్వంద్వాల చేతుల్లో చిక్కిన మనసులు నిజాన్ని నిజంగా గ్రహించలేవు. కల్తీ నెయ్యికి అలవాటు పడ్డ నాలిక స్వచ్ఛమైన నేతిని ఆనందంగా స్వీకరించగలదా? మనిషి తన చుట్టూ తనే ఓ కృత్రిమమైన పంజరాన్ని సృష్టించుకున్నాడు. ఆ పంజరం కట్టబడింది ధనం, అహంకారం, మమకారం, అధికారం, ప్రతీకారం అనేభావాలతో. అక్కడ 'పదవు'లనే పళ్ళు ఆహారంగా ఆ పంజరంలో పెట్టబడతాయి. పరువు

ప్రతిష్ఠలనే క్రిములు ఆ పళ్ళలో దాగుని వుంటాయి. ఆ పళ్ళని ఆహారంగా స్వీకరించిన వారు వాస్తవాన్ని చూడలేరు.. వినలేరు. ఓయీ మంచికీ చెడుకీ మధ్య జరిగే యుద్ధం ఇప్పటిది కాదు.

***ప్రకృతిని ప్రేమించేవారు దేవతలు. ఆ ప్రకృతిని ధ్వంసం చేసేవారు రాక్షసులు. దేవతలు ప్రకృతిని కాపాడితే రాక్షసులు ప్రకృతిని నాశనం చేస్తుంటారు. అసలు సిసలైన మానవులు ప్రకృతి సేవకులు.*** యుగ ప్రభావం వల్ల ఇది దుష్టులు చెలరేగే సమయం. ప్రభావంవల్ల ఇది దుష్టులు చెలరేగే సమయం.

దైవత్వం మాత్రమే ప్రకృతిని సంరక్షించలేదు. మానవుల్లో కూడా ప్రకృతి పట్ల తమ ధర్మాన్ని నిర్వర్తించాలి" ఓ క్షణం ఆగాడు విలియమ్స్.

ఆ మేఘావృత్తమైన రోడ్డు మీదనించే కారు దూసుకుపోతోంది. డ్రైవర్ కారుని ఓ ట్రాన్స్‌లో నడుపుతున్నాడు.

"కారు నడుపుతోంది మీరేకదూ మిస్టర్ విలియమ్స్" సడన్‌గా కారుని గమనించి అన్నాడు శ్రీనివాస్.

"అవును.. నేనే. ఇంతకు ముందే చెప్పానుగా నేను ఏ శరీరంలోనైనా ప్రవేశించగలననీ" ఓ నవ్వు కనిపించింది డ్రైవర్ పెదాలమీద.

"అంత శక్తి గలవారు మీరే స్వయంగా పూనుకోవచ్చుగా! రాబర్ట్‌గారినో, నన్నో, మరొకరినో ఎందుకు ప్రేరేపించడం?" సూటిగా అడిగాడు శ్రీనివాస్.

"ఏ ఆత్మ బలవంతంగా మరో ఆత్మని జోకొట్టి ఆ శరీరంలో ప్రవేశించినా, ఆ శరీరాన్ని ఆధీనంలో ఉంచుకోగలదేమోగానీ, మనస్సుని కాదు. చాలా మనసులకు కొంత నేర్పి ఆధీనంలో ఉంచుకోవచ్చు కానీ, ఆ శరీరంతోటీ, ఆ మనసుతోటీ అనుకున్న పనిని చేయించలేము. అందుకే ఏ పవిత్రమైన ఆత్మ అయినా ప్రకృతి రక్షణకే తోడ్పడుతుంది. అటువంటి వ్యక్తులనే ఒక చోట చేరుస్తుంది. దిశానిర్దేశం చేయగలిగేది మానవులలోని దివ్యాత్మలే" మళ్ళీ ఆగాడు విలియమ్స్.

"శాస్త్రిగారు, జయ్, సుదర్శన భట్టు వీరంతా దివ్యాత్ములంటారా? మరి రాబర్ట్?" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీనివాస్.

"యుద్ధంలో సైన్యాన్ని నడిపించేవాడు కమాండర్ ఒక్కడే అయితే అతనికి కావలసింది సుశిక్షితులైన సేవకులు. కమాండర్ ప్రజ్ఞ, సుశిక్షితుల్నీ క్రమశిక్షణ గలవారినే సైనికులుగా ఎన్నుకోవడంలోనే తెలుస్తుంది. జరగబోయే ఓ మహాసంగ్రామానికి సైన్యం సిద్దమవుతోంది. ఈ యుద్ధ తీవ్రత ఇప్పుడు తెలీదు."

"ఆ కమాండర్ మీరా?" సూటిగా అడిగాడు శ్రీనివాస్.

"నేనో చిన్న 'నట్టు'ని అంతే. అంత సామర్ధ్యం నాకు లేదు. తెలుసుకోగల మనోశక్తిలేదు" మాటల్ని ఆపేశాడు విలియమ్స్. శ్రీనివాస్ నోటికి కూడా తాళం పడ్డట్టు అనిపించింది. కారు స్పరున దూసుకుపోతుంటే, హెడ్ లైట్ వెలుగులో అనేకానేక జీవులు, కరెక్టుగా చెప్పాలంటే జీవుల నీడలు పక్కకి తొలిగిపోతున్నట్టు అనిపించింది శ్రీనివాస్‌కి.

"మనతో వచ్చిన వాళ్ళు రాత్రంతా ఆ కారులోనే ఉండిపోతారా?" చాలాసేపు గడిచాక అన్నాడు శ్రీనివాస్.

"ఉండక తప్పదు. మనం చేరాల్సిన గమ్యం వేరు, వాళ్ళు చేరాల్సిన గమ్యం వేరు. ఇప్పుడు మనం వెడుతున్నది కౌండిన్య వనానికి కాదు. మరోచోటుకి. కంగారు పడాల్సిన పనిలేదు. వారికి ఇప్పటికే కబురు అందింది. వారికి అందవలసిన దుస్తులూ ఆహారమూ వారికి సమకూర్చబడతాయి. నిర్భయంగా వుండు. హాయిగా నిద్రపో" అన్నాడు విలియమ్స్.

ఆ మాట వినగానే ఓ మగతలాంటిది కలిగింది శ్రీనివాస్‌కి. ఓ నిజంలాంటి కల. ఎవరెవరో దేవకన్యలు, తెల్లని, కాషాయరంగు, పసుప్పచ్చ, ఆకుపచ్చ రంగులు వ స్త్రాలు ధరించినవారు, మెడలోను కొప్పులోనూ భుజాలకీ నడుముకీ పూలదండలు ధరించినవారు తిరుగాడటం చూశాడు. వారి మొహంలో చెప్పలేనంత వెలుగు. ఆ వెలుగు వెన్నెలలా చల్లగా వుంది. వారి పెదాల మీద కరుణతో నిండిన చిరునవ్వు వుంది. వారేదో భాషలో గీతాల్ని ఆలపిస్తున్నారు. ఆ గీతాల మధురిమ చెప్పనలవికాదు. అర్ధంకాని భాషయినా అర్ధం అయినట్టే అతని మనసుకి తెలుస్తోంది. ఓ మబ్బుతెరలా ఓ నిద్రపొర అతడి కళ్ళను కప్పి వేసింది.

'హార్స్లీ హిల్స్' ప్రాంతం ఓ సౌందర్య లహరి. అఫ్‌కోర్స్, క్షణం క్షణం మారే ప్రకృతిని కళ్ళారా గమనించేవారికి లోకమే ఓ మహాద్భుతం. జననం ఓ అద్భుతం అయితే, శరీరానికీ మనస్సుకీ కూడా విశ్రాంతినిచ్చే మరణమూ ఓ అద్భుతమే. అనుభవించాలనే కుతూహలమూ మనసువున్న వారికి అనుక్షణమూ ఓ అద్భుతమే.

"మా హార్స్లీ హిల్స్‌లోని ప్రతి గులకరాయి కూడా ఓ సజీవ సాలగ్రామమే. మేం ప్రకృతిలో పుట్టాం. అందుకే, ప్రతి చెట్టూ పుట్టా కూడా మాతో సంభాషిస్తాయి" గర్వంగా అన్నది మదాలస. మదాలసకి ఇరవై రెండేళ్ళు ఉండొచ్చు. "లైఫ్ బాయ్ ఎక్కడ వుందో ఆరోగ్యం అక్కడవుంది' అన్న ప్రకటనలాగా, మదాలస ఎక్కడుంటే అక్కడ సందడి వుంటుంది. ఓ నవ్వుల ప్రవాహం ఆమె చుట్టూ వుండి తీరుతుంది. ఓ నవ్వుల ప్రవాహం ఆమె చుట్టూ వుండి తీరుతుంది. సంగీతం, సాహిత్యం, ఆవిడకి కుడి ఎడమలైతే, టీచింగ్‌లో అద్భుతమైన ప్రావీణ్యం ఆవిడ మేధోశక్తికి నిదర్శనం. అడిగిన వాళ్ళకేగాక అడగని వాళ్ళకి కూడా సహాయం చెయ్యడం ఆమె సహజగుణం. మండుటెండలో వెన్నెల విరిస్తే ఎలా ఉంటుందో చెప్పమంటే, ఆమె నవ్వుని ఉదహరించవచ్చు. అతి సున్నిత హాస్యం ఆమె మాటల్లో తొణికిసలాడుతూ వుంటుంది. మనసూ సున్నితమే.

"బాగుంది. ప్రస్తుతం యీ కొండా కోనా ఏమంటున్నాయో?" అడిగాడు సుదర్శన్.

"సుదర్శన్ గారూ, జీవితం క్షణికం, అంటే ఓ క్షణం మాత్రం అని అర్ధంకాదు, ప్రతిక్షణాన్నీ ఆనందంగా ఆస్వాదిస్తూ జీవించమని. జీవితం అనేది ఓ క్షణ సముద్రం. సముద్రంలో బిందువులు ఎలానో జీవితంలో క్షణాలు అటువంటివి. ఓ క్షణం రెండవుతుంది. రెండు నాలుగై, నాలుగు ఎనిమిదై అనంతంగా సాగుతుంది. సాగుతున్న కొద్దీ తనలోని క్షణాల్ని జ్ఞాపకాలుగా విసిరేసి ముందుకు సాగుతుంది. అందుకే కొండలూ కోనలూ అన్నిటినీ ఆనందంగానే స్వీకరిస్తాయి. ఆనందంతోనే స్పందిస్తాయి" నవ్వింది మదాలస.

" ఆ బుద్ధి మనుషులకు లేనందుకు విచారించలి" నిట్టూర్చి అన్నాడు సుదర్శన్.

"మనిషి బుద్దిజీవి. బుద్దుల్లో ఎడబుద్ధీ పెడబుద్ధీ వంటివి కూడా వున్నాయిగా! అందుకే చిత్తం వచ్చినట్టు ప్రవర్తిస్తాడు. తనని పెంచి పోషించే ప్రకృతినే సర్వనాశనం చేస్తాడు. ప్రాణమిచ్చేగాలినీ, దాహాన్ని తీర్చే నీటినీ, అన్నం పెట్టే నేలనీ కూడా విషపూరితం చేస్తాడు." ఓ క్షణం ఆగింది మదాలస.

"అవును.. ముమ్మాటికీ నిజం మదాలసగారు" తల వూపుతూ అన్నాడు సుదర్శన్.

"అసలు మన ఆలోచనలోనే లోపం వుంది సుదర్శన్‌గారు! ఎంత మందిని చంపితే అంత గొప్ప వీరులు అంటుంటాం. సింహాలనీ పులులనీ వేటాడి చంపిన వాడికి బిరుదులిస్తాం. వాళ్ళ ఫోటోలు ప్రముఖంగా పేపర్లో వేయిస్తాం.

అర్ధంటుగా ధనవంతులైన లౌక్యుల జీవితాల్ని పాఠాలుగా చదివిస్తారు. కష్టపడి పైకొచ్చిన వారి పేర్లు పది వుంటే, అడ్డదారిన అందలం ఎక్కినవారి పేర్లు తొంభై వుంటాయి. మనిషి గొప్పతనాన్ని అతని మానవత్వంతోటీ, ప్రవర్తన తోటీకాక, అతని ధనంతోటీ పదవితోటీ కొలవడం నిజంగా ఘోరం. సర్లెండి. ఇది 'కలిధర్మం' అని అనుకోవడం తప్పు, మార్చే విధానాన్ని కనుగొందామనే ప్రయత్నం ఎవ్వరూ చెయ్యడంలేదు. నిర్మించడం ఎంత కష్టమో విమర్శించడం అంత తేలిక. అందుకే, అలా తిరిగొద్దాం రండి. ఇక్కడున్న మహా వృక్షాలకి అద్భుతమైన చరిత్ర వుంది.. పదండి.. పరిచయం చేస్తాను" లేచింది మదాలస. తనూ లేచాడు సుదర్శన్.

మదాలస తండ్రిపేరు శ్రీమూర్తి - తల్లిపేరు వింధ్యారాణి. వారేనాడు తమ కులం గురించి మదాలసతో చర్చించలేదు. మేం కులం అనేది నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా తీర్చివేయడానికి పెద్దలు ప్రవేశపెట్టిన పథకం అనీ, అది కొన్ని శతాబ్దాలపాటు నిరుద్యోగ సమస్యను తీర్చడమే కాక 'తరతరాల అనుభవాల్ని' చెరిగిపోకుండా కాపాడిందనీ చెప్పేవారు.

"మనిషి చనిపోయినా మనిషి యొక్క అనుభవం చనిపోకూడదు" అనేదే కులానికి ప్రాతిపదిక అని వివరించి చెప్పేవారు. మెన్ మే డై బట్ హిస్ ఎక్స్పీరియన్స్ షుడ్ డై

***"సంతోషంగా వుండటమే పండగ. ఇతరులకు సహాయపడటమే పుణ్యం. నలుగురితో కలిసి మెలిసి ఉండటమే స్వర్గం. నీ స్వార్ధం నువ్వు చూసుకోవడమే నరకం"*** అని చక్కగా వివరించేవారు.

***"ప్రేమించడం దైవలక్షణం. ద్వేషించడం రాక్షసతత్వం. క్షమించడం నిజమైన మానవత్వం"*** అని చిన్నతనం నుంచీ ఆమెకి నూరిపోశారు.

"ఈ లోకానికి మనం అతిధులం మాత్రమే. కొంతకాలం వుండి వెళ్ళిపోతాం. అందుకే, మనం మనకోసం, మన తరవాత యీలోకానికి రాబోయే అతిధులకోసం ప్రకృతిని సంరక్షించాలి" అని మళ్ళీ మళ్ళీ చెప్పేవారు. అలాంటి తల్లిదండ్రుల సంరక్షణలో పెరిగిన మదాలస పదహారేళ్ళకే అద్భుత వ్యక్తిత్వాన్ని సంతరించుకోగలిగింది. మదాలస పంతొమ్మిదో ఏట తల్లీ, ఇరవయ్యో యేట తండ్రీ స్వర్గస్థులయ్యారు. ప్రస్తుతం ఆమె తల్లీ తండ్రీ గురువూ దైవం, రక్షకుడూ సంరక్షకుడూ యఙ్ఞనారాయణగారు ఒక్కరే. ఆయన్నే 'యఙ్ఞప్ప' అని పిలుస్తారు.

ప్రస్తుతం శాస్త్రిగారు, సుదర్శన్, రాబర్ట్, జయ్ మొదలైన వారంతా వున్నది యఙ్ఞప్పగారి ఇంట్లోనే. సుదర్శన్ మదాలస చెట్ల మధ్య తిరుగుతూ వుంటే, యఙ్ఞప్పగారు జైతోటీ, శాస్త్రిగారితోనూ మంతనాలు సాగిస్తున్నారు.

"దేవుడిచ్చిన కొడుకైనా కూతురైనా మనవరాలైనా నా మదాలసే. వాళ్ళ అమ్మా నాన్నలు ఎంత గొప్ప విద్యని ఆమెకి ఇచ్చారంటే, వాళ్ళ నాన్నగారు పోయినప్పుడు "తాతగారు వీరు జీవించి వున్నప్పుడు నా తండ్రి. ప్రస్తుతం ఆపాత్రని ముగించుకుని ఏ లోకం నించి వచ్చారో మళ్ళీ ఆ లోకానికే 'అతిధి'గా వెళ్ళిపోయారు. అపూర్వమూ అనంతమూ అయిన వారి ప్రేమాభిమానాల్ని నాకు ఆస్తిగా ఇచ్చి వెళ్ళిపోయారు. ఆయన వెడుతూ నన్ను మీ చేతుల్లో పెట్టి వెళ్ళారు. మీకు ఎటువంటి కష్టాన్నీ నేను కలిగించకూడదనే వరాన్ని నాకు ప్రసాదించండి అని అన్నది. ఎంత ప్రాఙ్ఞరాలు" శాస్త్రిగారితో అన్నాడు యఙ్ఞప్ప.

"ఆ మాట నిజం. లోకంలో ప్రతివ్యక్తీ ఓ నిఘంటువు. ఆ నిఘంటువు ఎంత గొప్పదంటే, ఎవరి పదాలకి వాళ్ళే అర్ధం వ్రాసుకుంటారు. ఆ పిల్లని చూసినప్పుడే ఓ ఆత్మీయ భావం కలిగింది. ఆత్మీయభావం అంటే ఆత్మకి సంబంధించి న ఓ కదలిక. గత జన్మలకి సంబంధించిన బంధం. ఎంత చిత్రమో నేను పుట్టిన 37 ఏళ్ళకి మిమ్మల్నీ మదాలసనీ కలవటం

జరిగింది. అసలిలా కలవగలనని ఊహించను కూడా లేదు. కొండలూ గుట్టలూ దాటి వచ్చిన కారు టైర్లు మైదానంలో పేలిపోవడం, మీరు ఆతిధ్యమివ్వడం నేను కలలోకూడా వూహించలేదు. అయ్యా, తరచి తరచి ఆలోచిస్తే, జీవితాన్ని మించిన సస్పెన్స్ లోకంలో అసలు వుంటుందా?" విశ్రాంతిగా అన్నారు శాస్త్రిగారు.

"అసలిలాంటి భవంతి ఉన్నదనే నాకు తెలీదు" సిన్సియర్‌గా అన్నాడు జై.

రాబర్ట్ నిద్ర కాని నిద్రలో మునకలేస్తూనే వున్నాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments